## రేషన్ షాపులను తనిఖీ చేసిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్



-రేషన్ షాపుకు సీల్

2 లో

www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 11 | డిసెంబర్ | 2025
పేజీలు : 7

# నేడు తొలి విడత ఎన్నికలు



-ఏడు మండలాల్లో 172 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు
-పోలింగ్‌కు సర్వం సిద్ధం
-ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి
-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి తొలి విడత పోలింగ్ నేడు గురువారం జరగనుంది. తొలి విడతలో ఏడు మండలాల పరిధిలో 172 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. కొణిజర్ల, వైరా, రఘునాథపాలెం, బోనకల్, మధిర, ఎర్రుపాలెం, చింతకాని మండలాల పరిధిలోని 172 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు, 1415 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

మిగతా 2లో..

## ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



-భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి పాటిల్
-భద్రత నడుమ ఎన్నికల సామగ్రిని సెక్టార్లవారీగా సంబంధిత పోలింగ్ స్టేషన్లకు తరలింపు

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రశాంతంగా ఎన్నికలను నిర్వహించడానికి ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం బూర్గంపాడు మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఆవరణలో సాధారణ గ్రామ పంచాయితీ సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలకు సంబంధించి ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ వేరువేరుగా సందర్శించి గ్రామ పంచాయితీ ఎన్నికల వీధులలో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చి వారి వారి పోలింగ్ స్టేషన్‌లకు పంపిన అనంతరం ఆయన మాట్లాడుతూ 18 గ్రామ పంచాయితీలలో ఐదు గ్రామ పంచాయితీలు ఏకగ్రీవం కాగా మిగిలిన 13 గ్రామ పంచాయితీలకు గాను 48మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్

మిగతా 2లో..

## సమస్యల పరిష్కారమే సిపిఐ ప్రధాన ఎజెండా



- సిపిఐని గెలిపించి అభివృద్ధికి అండగా నిలవండి
- పారదర్శక పాలన సిపిఐతోనే సాధ్యం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని
- పంచాయితీల్లో విస్తృత పర్యటన

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడమే సిపిఐ ప్రధాన ఎజెండా అని, సిపిఐ ప్రజాప్రతినిధుల లక్ష్యమని కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. గ్రామపంచాయితీ ఎన్నికలను పురస్కరించుకుని బుధవారం చుంచుపల్లి మండల పరిధిలోని పెనుబల్లి, పెనగడప, అంబేద్కర్ నగర్, గ్రామ పంచాయితీలతో పాటు లక్ష్మీ దేవిపల్లి మండల పరిధిలోని శేషగిరినగర్ తెలగరామవరం, హేమచంద్రాపురం, గుడ్డిగుట్ట గ్రామ పంచాయితీల్లో విస్తృతంగా

మిగతా 2లో..

# నేడు తొలి విడత ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

మొదటి విడతలో 2,41,137 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ గురువారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరగనుంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, సిసి కెమెరాలతో పర్యవేక్షణ చేయనున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల నుంచి పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎన్నికల సామగ్రిని తీసుకుని వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు బుధవారం తరలి వెళ్లారు. రాత్రి సిబ్బంది అక్కడే బస చేయనున్నారు. గురువారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభించేలా ఏర్పాట్లు చేపట్టనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్ సౌకర్యం, త్రాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించారు.

**పోలింగ్‌కు సర్వం సిద్ధం : కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే గ్రామాల్లో పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ప్రజలు ఎటువంటి ఒత్తిళ్లు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మొదటి విడత ఎన్నికల సందర్భంగా రఘునాథపాలెం మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణం నందు ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలను బుధవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేశారు. డిస్ట్రిబ్యూషన్,రిసెప్షన్ కేంద్రాల్లో బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులు, పోలింగ్‌లో వినియోగించే ఎన్నికల సామగ్రిని పరిశీలించి పోలింగ్ సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది  విధులకు సంబంధించి పలు సూచనలు చేశారు. పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్స్ సీలింగ్, ఓట్ల లెక్కింపు, సర్పంచ్ నియమాక పత్రాలు ఇవ్వడం, ఉప సర్పంచ్ ఎన్నిక తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడతలో జిల్లాలో ఏడు మండలాల్లో సర్పంచ్, వార్డు మెంబర్ల స్థానాలకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి లెక్కింపు నిర్వహించి ఉప సర్పంచ్ ఎన్నిక పూర్తి చేసి ఫలితాలను వెల్లడిస్తారని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు కల్పించామన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ లోకేషన్స్ గుర్తించి క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని, సిసి కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని, సెన్సిటీవ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఎటువంటి ఒత్తిళ్లు, భయాందోళనలు లేకుండా తమ ప్రజాస్వామ్యమైన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. గ్రామంలో ప్రతి ఓటు విలువైందని ఓటర్లంతా నిర్ణీత సమయానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చి స్వేచ్ఛగా ఓటు వేయాలని కోరారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో పూర్తయ్యే వరకు గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఏకగ్రీవ పంచాయతీల్లో సైతం కోడ్ అమల్లో ఉంటుందని తెలిపారు. పోలింగ్ సిబ్బంది అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, త్రాగునీరు, కూర్చునే ఏర్పాట్లు, ప్రత్యేక అవసరాలు ఉన్న ఓటర్లకు సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జి. నర్సింహారావు, రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, ఎంపిడివో అశోక్‌కుమార్, ఎంపివో శ్రీనివాసరెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

(మొదటిపేజీ తరువాయి)

వేసి బరిలో ఉన్నారని, అలాగే 182 వార్డులకు 57 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నుకోగా 125 వార్డులకు  308 మంది వార్డు సభ్యులగా బిరలో నిలుచున్నారని అన్నారు. గురువారం నాడు జరిగే గ్రామ పంచాయితీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పోలింగ్ స్టేషనులక ప్రత్యేక పోలీస్ భద్రత నడుమ పూర్తి స్థాయి సెక్యూరిటీతో ఆయా సెక్టార్లకు పంపించడం జరిగిందన్నారు. ప్రతి సెక్టార్ రూటుల వారీగా పోలింగ్ స్టేషన్లను బట్టి సిబ్బందిని చేరవేయడానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి పది మంది రూట్ ఆఫీసర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, 165 పోలింగ్ స్టేషన్లకు గాను 04 మంది జోనల్ అధికారులను, 165 పోలింగ్ స్టేషన్లకు 165 పిఓలు, 240 ఓపిఓలు, రిజర్వుగా 30 మంది పోలింగ్ సిబ్బందిని కూడా నియమించడం జరిగిందని అన్నారు. ఎన్నికల విధులకు వెళ్లే పోలింగ్ స్టేషన్ల సిబ్బందికి చలికాలాన్ని దృష్టిలో పెట్టుకొని వారికి అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, అలాగే పోలింగ్ స్టేషన్లలో కరెంటు, మంచినీటి సౌకర్యం, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగిందని, పోలింగ్ స్టేషన్లలో నియమించబడ్డ సిబ్బందికి ముందుగా పోలింగ్ మెటీరియల్ ఇవ్వడం జరిగిందని, వారు సామాగ్రి సరి చూసుకున్న అనంతరం పంచాయితీ రాజ్ జిల్లా రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు, సహాయ ఎన్నికల అధికారి జములారెడ్డి సమక్షంలో పోలీస్ స్టేషన్ నుండి బ్యాలెట్ బాక్సులు తీసుకొని వచ్చి పోలింగ్ సిబ్బందికి అందించారు. సంబంధిత పోలింగ్ సిబ్బంది వారి వారి పోలింగ్ స్టేషన్లకు చేరుకున్న తర్వాత 11వ తేదీ ఉదయం 7గంటలకు జరిగే ఓటింగ్ ప్రక్రియను సంబంధించి అన్ని ఏర్పాట్లు పదో తేదీ సాయంత్రం వరకు పూర్తి చేసుకోవాలని, 11వ తేదీ ఉదయం సెక్టారల్ ఆఫీసర్లు, పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్‌కు సిల్ వేసి ఉదయం ఏడు గంటలకు ఓటింగ్ ప్రక్రియ ప్రారంభించాలని, మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ అయిపోయే సమయంలో ఓటర్లు గనక ఉంటే ప్రత్యేకంగా తయారు చేసిన స్లిప్పులను అందించి ఓటింగ్ ప్రక్రియ అయిపోగానే సామాన్లన్నీ జాగ్రత్తగా తీసుకొని భద్రత నడుమ రూట్ ఆఫీసర్ల సమక్షంలో తిరిగి తీసుకురావాలన్నారు. పోలింగ్ సిబ్బందికి ఏ చిన్న సమస్య వచ్చినా సొంతంగా నిర్ణయం తీసుకోవద్దని, ఏ సమస్య ఉన్న సంబంధిత రూట్ అధికారికి, ఏఆర్ఓకి తెలియజేయాలన్నారు. పోలింగ్ ఏజెంట్ల ద్వారా టెండర్ ఓటు, ఛాలెంజ్ ఓటు గురించి సమస్య వస్తే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్య పరిష్కరించుకోవాలని అన్నారు. ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైన దగ్గర్నుండి అన్ని పోలింగ్ స్టేషన్‌ల నుండి గంటకు ఒకసారి పోలింగ్ సరళిని తప్పనిసరిగా ఏఆర్ఓకి తెలియజేయాలని అన్నారు. పోలింగ్ సెక్టారల్ అధికారుల నుండి మొదలుకొని, పిఓ, ఓపిఓలు, పోలింగ్ స్టేషన్లో వివిధ పనులకు నియమించిన సిబ్బంది అందరూ కలిసికట్టుగా ఉండి గ్రామ పంచాయితీ పోలింగ్ ప్రక్రియ ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా సహకరించాలని అన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్ధార్ కెఆర్‌కె ప్రసాద్, ఇన్‌చార్జ్ ఎంపీఓ బాలయ్య, టివోటిలు భాస్కర్, మోహన్, ఆర్ఐలు, ఎంపీడీవోలు, రెవెన్యూ కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు నిర్ణీత సమయానికి పూర్తి చేయాలి

**- సమీక్షా సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క**



ప్రజాపక్షం/ మధిర : మధిర పట్టణంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులు అన్ని నిర్ణత సమయానికి పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లను డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆయన మధిర క్యాంపు కార్యాలయంలో మధిర మున్సిపాల్టీకి సంబంధించిన అభివృద్ధి పనుల ప్రగతిపై వివిధశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కిందస్థాయిలో పనిచేసే అధికారులు సమస్యలు ఎప్పటికప్పుడు వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేయాలని, ఉన్నతాధికారులు వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. మున్సిపల్ అధికారులు క్వాలిటీ అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని డిప్యూటీసిఎం సూచించారు.  అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులు  ఎప్పుడు మొదలు పెట్టారు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయి నిర్ణీత  సమయానికి పనులు పూర్తి కావాలంటే ఏ తరహాలో మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్ స్పందించాల్సిన తీరుపై డిప్యూటీ సిఎం పలు సూచనలు చేశారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని, ఎప్పటికప్పుడు థర్డ్ పార్టీ ఏజెన్సీతో క్యాలిటీ తనిఖీ జరగాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఆలస్యం జరిగితే ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితులు ఉంటాయని, ఆ పరిస్థితి ఏర్పడవద్దని డిప్యూటీ సిఎం ఆదేశించారు. మధిర మున్సిపల్ కార్యాలయానికి సంబంధించిన నూతన భవన నమూనాలను ఈ సందర్భంగా పరిశీలించారు.  ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ వార్డుల వారీగా పరిస్థితిని ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారమే

# సిపిఐ ప్రధాన ఎజెండా





(మొదటిపేజీ తరువాయి)

పర్యటించి అభ్యర్ధులకు, పార్టీ శ్రేణులకు దిశానిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో కూనంనేని మాట్లాడుతూ గ్రామాల్లో పారదర్శక పాలన సిపిఐ ప్రజా ప్రతినిధులతోనే సాధ్యమని, ప్రజలకు వెన్నంటి ఉండేది సిపిఐ ప్రజాప్రతినిధులే అని అన్నారు. గ్రామ స్వపరిపాలన కోసం ప్రజల్లో మమేకమయ్యే సిపిఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గడిచిన రెండేళ్లలో ప్రభుత్వంతో కొట్లాడి వివిధ పథకాల్లో నిధులు రాబట్టి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామని, ప్రజా సమస్యలు పరిష్కరించ గలిగామని చెప్పారు. ప్రతి పథకాన్ని పేదల గడపకు చేర్చే బాధ్యతాయుత పాలనకు కమ్యూనిస్టు పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

### రేషన్ షాపులను తనిఖీ చేసిన

# విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్  : రేషన్ బియ్యాన్ని డీలర్లు పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఖమ్మం నగరంలోని రేషన్ షాపులను విస్తృతంగా తనిఖీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డి డిఎస్‌పి అంజయ్య నేతృత్వంలో నాలుగు బృందాలు మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు ఖమ్మం నగరంలో 40 రేషన్ షాపులను తనిఖీ చేశారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఖమ్మం నగరంలోని 91వ షాపును తనిఖీ చేసేందుకు వెళ్లగా అక్కడ షాపు తెరిచి ఉండకపోవడంతో డీలర్ వెంకటేశ్వర్లుకు పలుమార్లు అధికారులు ఫోన్ చేయగా స్పందించకపోవడంతో ఆ షాపుకు సీల్ వేశారు. డీలర్ వచ్చే వరకు షాపు సీల్ తీయవద్దని షాపులో అదనంగా బియ్యం ఉంటే సీజ్ చేసి డీలర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సివిల్ సప్లయ్ డిటిని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఎస్‌పి అంజయ్య ఆదేశించారు. అట్టి డీలర్ కార్డుదారుల వద్ద బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి బయట వ్యాపారులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు పలు ఆరోపణలు కూడా వినవస్తున్నాయన్నారు. అదేవిధంగా టేకులపల్లిలోని రేషన్ షాపును విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేయగా స్టాక్ రికార్డు మేరకు లేకుండా బియ్యం అదనంగా ఉన్నట్లు గుర్తించారు. సదరు షాపు డీలర్‌పై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు గాను అమ్యామ్యాలు ముట్టజెప్పినట్లు, ఇందుకు స్థానిక సివిల్ సప్లయ్ అధికారులు కూడా సహకరించినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ తనిఖీల్లో సివిల్ సప్లయ్ డిటిలు మెచ్చు వెంకటేశ్వర్లు, విజయ్‌బాబు, నాగలక్ష్మి, టాస్క్‌ఫోర్స్ ఏఎస్ఐ వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గైగోల్లపల్లిలో కాంగ్రెస్ అభ్యర్ధి విస్తృత ప్రచారం



ప్రజాపక్షం/కూసుమంచి: మండలంలోని గైగోలపల్లి గ్రామ పంచాయితీలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి బాధావత్ జయంతి కత్తెర గుర్తుపై పోటీ చేస్తూ గైగోల్లపల్లి గ్రామంలో తనను గెలిపిస్తే ప్రజలందరికి అందుబాటులో ఉంటానని మాజీ ఎంపీపీ మట్టి గురవయ్య, మాజీ సర్పంచ్ శ్యాం సుందర్‌రెడ్డి దీవెనలతో ఆమె విస్తృతంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి గ్రామములో ఇంటింటికి తిరుగుతూ తమను గెలిపించమని ప్రజలను వేడుకుంటున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను ప్రచారంలో ప్రజల నుండి సంపూర్ణ మద్దతు లభిస్తుందని వచ్చే ఫలితాలలో తాను గెలుపొందుతానని భీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అనుమతి లేకుండా

## కాంగ్రెస్ పార్టీ జెండాను వినియోగించొద్దు

**పెనుబల్లి మండల పార్టీ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు**



ప్రజాపక్షం/పెనుబల్లి: పెనుబల్లి మండలంలో ఈ నెల 17న జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరువున ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ బలపరిచిన అభ్యర్థులు మాత్రమే కాంగ్రెస్ పార్టీ కి సంబంధించిన పార్టీ అభ్యర్థులు అని, వారు మాత్రమే కాంగ్రెస్ జెండా కలర్ కానీ, ఎమ్మెల్యే దంపతుల ఫోటోలు, అలాగే ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రుల ఫోటోలు పెట్టుకోవడానికి అర్హులు అని పెనుబల్లి మండల పార్టీ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.  ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గమనించాలని కోరారు. అదేవిధంగా రెబల్ అభ్యర్థులు కానీ, ఇండిపెండెంట్ అభ్యర్థులు కానీ కాంగ్రెస్ పార్టీ మూడు రంగులు కానీ, ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యే దంపతులు ఫోటోలు వాడటానికి అనర్హులని తెలిపారు. అలా వాడితే తగిన చర్యలకు అర్హులు అవుతారని ఆయన తెలిపారు.

# నేడు పంచాయతీ ఎన్నికలు



**-32 సర్పంచ్, 268 వార్డులకు ఎన్నికలు**
**-మండలంలో 33,163 మంది ఓటర్లు**

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రఘునాథపాలెం మండలంలో పంచాయతీ ఎన్నికలు నేడు (గురువారం) జరగనున్నాయి. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్ జరగనుండగా, మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మొత్తం మండలంలో 37 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో ఐదు సర్పంచ్ స్థానాలతో పాటు 40 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. రఘునాథపాలెంలో సర్పంచ్ స్థానంతో పాటు 12 వార్డులకు గాను 10 వార్డులు ఏకగ్రీవం కాగా రెండు వార్డుల్లో పోలింగ్ జరగ నుంది. 33 గ్రామ పంచాయతీల పరిధిలో 32 సర్పంచ్ స్థానాలకు, 268 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనుండగా 33,163 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మండలంలో నాలుగు జోన్లు పరిధిలో 11 రూట్లను ఏర్పాటు చేసి 11 మంది రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించారు. మొత్తం 268 పోలింగ్ బూత్‌లకు గాను 597 మంది పోలింగ్ అధికారులను, సిబ్బందిని నియమించారు. 120 మంది రిజర్వ్డు పోలింగ్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. మొత్తం 717 మంది పోలింగ్ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. బుధవారం మధ్యాహ్నం నుంచి పోలింగ్ అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ బూత్‌లకు పోలింగ్ సామగ్రిని తీసుకెళ్లారు. పోలింగ్ బూత్‌ల వద్ద అవసరమైన మౌలిక వసతులతో పాటు సిబ్బందికి రాత్రి బసకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్ వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రత్యేకాధికారులతో పాటు ఎంపిడివో అశోక్‌కుమార్, ఎంపివో శ్రీనివాసరెడ్డి, రఘునాథపాలెం సిఐ ఉస్మాన్ షరీఫ్ లు ఎన్నికలను పర్యవేక్షించనున్నారు.

# పంచాయతీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు



**-అడిషనల్ డిసిపి ప్రసాదరావు**

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు రఘునాథపాలెం మండలం గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ బందోబస్తు, రూట్ మొబైల్ బందోబస్తు, పోలింగ్ స్టేషన్ బందోబస్తు, సిబ్బంది విధి విధానాలపై బుధవారం రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ముందస్తు భద్రతా ఏర్పాట్లతో ఏ చిన్న సంఘటనలకు ఆస్కారం లేకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పోలీస్ సిబ్బందికి అప్పగించిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల పర్యవేక్షణ అధికారులు సమన్వయంతో ప్రశాంతంగా ఎన్నికల బందోబస్తును విజయవంతం చేయాలని సూచించారు. శాంతి భద్రతల దృష్ట్యా ఎన్నికల ఫలితాలు వెల్లడించిన అనంతరం ఎలాంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన తగు చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో ఏదైనా ఘర్షణ వాతావరణం ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి (ఏఆర్) కుమారస్వామి, టౌన్ ఏసిపి రమణమూర్తి, సిఐ ఉస్మాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోండి : ఎసిపి



**ప్రజాపక్షం/మధిర :** మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మధిర మండలంలోని 27 గ్రామపంచాయతీల గాను 25గ్రామపంచాయతీలకు జరిగే ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. డిసెంబర్ 11న తొలి విడత ఎన్నికలు సందర్భంగా బుధవారం స్థానిక టివిఎం హైస్కూల్ నందు విధులకు హాజరయ్యే పోలీస్ సిబ్బందికి ప్రత్యేక బ్రీఫింగ్ సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వైరా ఇన్‌చార్జి ఎసిపి వసుంధర యాదవ్ ఎన్నికలు సజావుగా జరిగేందుకు సలహాలు, సూచనలు చేశారు. ఎన్నికలు శాంతియుతంగా సాగేందుకు ప్రతి పోలీస్ అధికారి తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఉదయం 7గంటల నుండి సాయంత్రం 3గంటల వరకు ఎన్నికలు జరుగనున్నాయని తెలిపారు. వివాదాస్పద ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి సంఘటనలు జరిగినా వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. ఎన్నికలు నిబంధనలు ఎవరైనా ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేవిధంగా పోలీసులు తీసుకునే చర్యలకు ప్రజలు సహకరించాలన్నారు. ప్రతిఒక్కరూ ఎటువంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లొంగకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాల్లో పూర్తి బందోబస్తు నిర్వహించి ఎన్నికలు సజావుగా జరిగేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎన్నికల సమయంలో ఘర్షణ వాతావరణం సృష్టించినా, దాడులకు పాల్పడే సంఘటనలు జరిగినా బాధ్యులైన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం ఎన్నికల సామాగ్రిని పోలీస్ సిబ్బంది, అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో మధిర సర్కిల్ సిఐలు రమేష్, మధు, రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవి, ఇతర పోలీస్ సిబ్బంది, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి ఆదర్శంగా తీర్చిదిద్దుతా

**- సిపిఎం బలపరచిన బిఆర్ఎస్ అభ్యర్థి మహబూబ్అలీ**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** పంచాయతీ ఎ న్నికలలో పోలేపల్లి సర్పంచ్‌గా సిపిఎం పార్టీ బలపరిచిన అభ్యర్థిగా పోటీ చేస్తున్న నన్ను ఆశీర్వదిస్తే ఊరిని అన్ని రంగాలలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని, అభ్యర్థి మహబూబ్ అలీ పేర్కొన్నారు. ఇప్పటికే తన చాందిన టెంట్‌హౌస్, సీఎంఆర్ ఫంక్షన్‌హాలతో ప్రజల తలలో నాలుకగా ఉంటున్న విషయం తెలిసిందే. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ శుభకార్యాలు, అశుభకార్యాలు జరిగిన ప్రతి ఇంటికి చేయూతనిస్తానన్నారు. అలాగే డ్రైయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానని, ప్రతి ఒక్కరికి పిలిస్తే పలుకుతానన్నారు. ఊరిలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమ పథకాలను అందించడంలో ప్రత్యేక చొరవ తీసుకుంటానన్నారు. తను గెలిచిన నాటి నుంచే ప్రత్యేక ప్రణాళికను రూపొందించి ఊరిలోని ప్రతి సమస్యను పరిష్కారం చేసే బాధ్యత నాదేనన్నారు. కావున కత్తెర గుర్తుపై ఓటు వేసి మీబిడ్డనైన నన్ను ఆశీర్వదించండని వేడుకుంటున్నారు. ఇదిలా ఉండగా అభ్యర్థి పేరు ప్రకటించిన నాటి నుంచే ఊరిలో మంచి వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో గెలుపు ధీమాను ప్రస్ఫుటితం చేస్తుండటం శుభపరిణామంగా చెప్పవచ్చు.

# ఓటింగ్ కోసం 18 రకాల గుర్తింపుకార్డుల్లో ఏదైనా చూపవచ్చు : కలెక్టర్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఈనెల 11, 14, 17 తేదీల్లో మూడు విడతల్లో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా చూపవచ్చునని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లేటప్పుడు ఓటరు గుర్తింపు కార్డు లేని పక్షంలో 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక దానిని తమ వెంట తీసుకెళ్లి చూపవచ్చునని కలెక్టర్ తెలిపారు. ఆధార్ కార్డు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ జాబ్‌కార్డు, ఫోటోతో కూడిన పోస్టాఫీస్, బ్యాంక్ పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డ్, ఫోటోతో కూడిన ఎస్సి, ఎస్టి, బిసి కుల ధృవీకరణ పత్రాలు, ఇండియన్ పాస్ పోర్ట్, ఫోటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే జారీ చేయబడిన ఉద్యోగ గుర్తింపు కార్డు, ఎంఎల్ఎ, ఎంఎల్‌సిలకు ఇచ్చిన అధికారిక గుర్తింపు కార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, రేషన్‌కార్డు, ఫోటోతో కూడిన ఆయుధ లైసెన్స్ పత్రం, ఫ్రీడం ఫైటర్ ఐడి కార్డు, ఆర్బిఐ ద్వారా జారీ చేయబడిన ఎన్‌పిఆర్ స్మార్ట్ కార్డ్, ఎంపిలకు జారీ చేయబడిన గుర్తింపు కార్డు మొదలగు వాటిలో ఏదైనా ఒక దానిని చూపించి ఓటు వేయవచ్చునని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని కలెక్టర్ తెలిపారు.

# అశ్వారావుపేటలో అసిస్టెంట్ కలెక్టర్ విస్తృత పర్యటన



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మున్సిపాల్టీలో అసిస్టెంట్ కలెక్టర్ సౌరభ్‌శర్మ బుధవారం విస్తృతంగా పర్యటించారు. అసిస్టెంట్ కలెక్టర్ మూడువారాల పాటు అశ్వారావుపేట మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించనున్నారు. ముందుగా మున్సిపల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి కార్యనిర్వహణపై మున్సిపల్ కమీషనర్ బి.నాగరాజుతో సంభాషించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి శానిటేషన్ పనుల నిర్వహణపై గృహ యజమానులతో మాట్లాడారు. ఇంటి పన్నుల చెల్లింపులు విషయమైన అడిగి తెలుసుకున్నారు. అశ్వారావుపేట మున్సిపాల్టీలో స్థానిక పరిపాలనపై క్షుణ్ణంగా పరిశీలించారు. దొంతకుంట చెరువు, మినీ క్రీడా ప్రాంగణం ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మండలంలో అభ్యర్థుల విస్తృత ప్రచారం

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మండలంలో ఈనెల 14న జరగనున్న స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులు విస్తృతంగా పర్యటన చేస్తూ ఓట్లను అభ్యర్థిస్తూ హోరాహోరీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్, టిఆర్ఎస్‌తో పాటు సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీతో అభ్యర్థులు సైతం హోరాహోరిగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీకి టిఆర్ఎస్ పార్టీకి రెబల్ అభ్యర్థుల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయినప్పటికీ ప్రచారంలో ఎవరికి వారు తమను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే ఓటర్లు సైతం ఎవరికి ఓటేయాలని దాన్లో ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. రెండు రోజుల్లో ప్రచార పర్వం ముగియనుండటంతో అభ్యర్థులు బంధుగణాలతో పాటు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు పోలీస్ బోర్డర్ చెక్‌పోస్ట్‌ల్లో ప్రత్యేక తనిఖీలను ఏర్పాటు చేసి రూ.50వేలకు పైగా నగదు తీసుకెళ్లకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో సజావుగా ఎన్నికల నిర్వహణ ప్రక్రియ పూర్తి చేసేందుకు సిఐ నాగరాజురెడ్డి, ఎస్సైలు గ్రామాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా పోటీ చేసిన అభ్యర్థులను ఓటర్లను ఎటువంటి ప్రలోభాలకు గురి చేయకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు.

# పోలింగ్‌కు సర్వం సిద్ధం



**ప్రజాపక్షం/చింతకాని :** గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి ,ఎంపీడీవో చంచు శ్రీనివాసరావు తెలిపారు. చింతకాని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామాగ్రి బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ స్టేషన్లకు చేరుకున్న సిబ్బంది ఏర్పాట్లలో మునిగిపోయారు. ఎన్నికల సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# పోలింగ్‌కు భారీ బందోబస్తు



**ప్రజాపక్షం/చింతకాని :** మండలంలో ఇటీవల జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీ ఎన్నికలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు అడిషినల్ సీపీ రామానుజన్ పేర్కొన్నారు. చింతకానిలో ఆయన పోలీస్ సిబ్బందితో బుధవారం మాట్లాడారు.ఒడలంలో 416 మంది పోలీస్ సిబ్బందిని నియమించామన్నారు. వీరిలో ఇద్దరు ఏసీపీలు, ఇద్దరు సిఐలు, 13 మంది ఎస్సైలతో పాటు ప్రత్యేక పోలీస్ బృందం ఉందన్నారు. ఎన్నికల సందర్భంగా అల్లర్లు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి అలసత్వం లేకుండా సిబ్బంది క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ సాంబరాజు, పలువురు సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## ప్రజాపంథా అభ్యర్థులను గెలిపించండి



ప్రజాపక్షం/గుండాల : ప్రజాపంథా పార్టీ నుండి బరిలో ఉన్న సర్పంచి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జిల్లానాయకురాలు చంద్ర అరుణ , మాచర్ల సత్యం బుధవారం పత్రికా విలేకర్ల సమావేశంలో పేర్కొన్నారు. ఈ నెల 17న జరగనున్న సర్పం చి ఎన్నికల్లో తమ పార్టీ నుండి బరిలో ఉన్న గుండాల పంచాయినుండి ఈసం శ్రీను(శంకర్) , ముత్తాపురం పంచాయితీనుండిపూనెం రమాదేవి, లింగగూడెం పంచాయితీనుండి కల్తి ప్రశాంతులను ప్రజలు తమ అమూల్యమైన ఓటును వేసి గెలిపించాలని ప్రార్ధించారు. శంకర్ మాట్లాడుతూ బాటన్న, గుమ్మడి నర్సయ్యల స్పూర్తితో నిజాయితీగా ప్రజా అభివృద్ధికోసం పనిచేస్తామని అన్నారు. కాల క్రమేన రాజకీయాలు వ్యాపారాలుగా మారుతున్నాయని , ఎన్నికల్లో ధనప్రవాహం ఇంకా అనేక ప్రలోబాలు శాసిస్తున్నాయని ఇటువంటి సందర్బంలో ప్రజలపక్షాన పోరాడే పార్టీలకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. తమపార్టీకి మద్దతును టిడిపి గుండాల మండలకమిటి ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొమరం శాంతయ్య, ఊకె బాబు, టి సాంబయ్య, అప్పారావు, ఇ నర్సింహులు, చంద్రయ్య, తెలం రాజు, జగన్, ఆజాద్, రాంబాయి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సాయి ఎక్సలెంట్ పాఠశాల 28వ వార్షికోత్సవం



ప్రజాపక్షం/జూలూరుపాడుః గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ప్రైవేటు విద్యను అందించేందుకు సాయి ఎక్సలెంట్ పాఠశాల కృషి చేస్తుందని ఆర్ అండ్ బి సూపరింటెండెంట్ గొల్లమందల రమేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సాయి ఎక్సలెంట్ పాఠశాల 28వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ ఆదాయ సంపాదన కోసం కార్పొరేట్ పాఠశాలను నెలకొల్పుతున్న ఈ రోజుల్లో పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న యాజమాన్యాన్ని రమేష్ బాబు అభినందించారు. అదేవిదంగా గత ఏడాది విద్యా సంవత్సరంలో సాయి ఎక్సలెంట్ పాఠశాలలో 10 నవోదయ సీట్లు, 70 గురుకుల సీట్లు సాధించడం కూడా చాలా సంతోషమన్నారు. పాఠశాల విద్యార్థులు ఇంకా మున్ముందు మరెన్నో విజయాలు సాధించి పాఠశాలకు మరియు మీ యొక్క తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని కోరారు

## ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి



ప్రజాపక్షం/జూలూరుపాడుః జూలూరుపాడు మండల ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో జూలూరుపాడు మండలం గ్రామ పంచాయతీ ఎన్నికలలో నామినేషన్ వేసి పోటీలో నిలబడిన అభ్యర్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్ నందు బుధవారం ఎన్నికల ప్రవర్తన నియమావళి, నిర్వహణపై పంచాయతీ ఎన్నికల పోటీ అభ్యర్థులకు నిర్వహించారు. ఈ సందర్బంగా జిల్లా ఎక్స్పెండించర్ నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, కొత్తగూడెం డిఎస్పీ అబ్దుల్ రెహమాన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా కీలకమని, వ్యక్తిగత దూషణలకు వెళ్లకుండా అందరూ సమన్వయం పాటించాలని అన్నారు. మండలంలో ఎన్నికలు జరుగుతున్న పంచాయతీలలో ఎక్కడా శాంతిభద్రతల సమస్య రాకుండా పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ముఖ్యంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎన్నికల ప్రచారాలు నిబంధనలకు అనుగుణంగా పాటించాలని, ఎలాంటి ర్యాలీలు గాని సమావేశాలకు గాని అనుమతి లేవని, ఇది గమనించి అందరూ సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో జూలూరుపాడు తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ అజయ్, జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి



ప్రజాపక్షం/పెనుబల్లిః కాంగ్రెస్ పార్టీ రెబల్ గా వీఎం బంజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన భూక్యా రాజా బాబు వార్డు మెంబర్స్ అభ్యర్థులతో కలిసి చేయి వదిలి కారు ఎక్కి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వీఎం బంజర్ పంచాయితీకి పోటీలో కాంగ్రెస్ పార్టీ నుండి అనుమతిని ఆశించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మరొకరిని ప్రకటించడంతో తన అనుచరులతో కలిసి బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర ఆదేశాలతో గురువారం మాజీ ఏఎంసి చైర్మన్ చెక్కిలాల లక్ష్మణ్ రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. వీఎం బంజర్ బిఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచి ప్రచారం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు చెక్కిలాల లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ తేజవత్ తావు నాయక్, షేక్ గౌస్, మారకాల చంటి, వేముల సురేష్, బజ్జూరి వంశీ తదితరులు పాల్గొన్నారు.

# అమాయకులను మోసం చేస్తున్న బ్రదర్స్

**దమ్మపేట మండలంలో గుట్టుగా వ్యాపారం**



ప్రజాపక్షం/సత్తుపల్లిః అమాయకులను ఆసరగా చేసుకొని వారి ఖాతాల నుండి పోట్రు బ్రదర్స్ కోట్లు కొల్లగొట్టినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఆ డబ్బుతో జల్సాలు చేశారని, కాలర్ నలగకుండా, చేతులకు మట్టి అంటకుండ కోట్లు సంపాదించిన వారు ఆ డబ్బును వారి స్నేహితుల వద్ద దాచినట్లు గుస, గుసలు వినిపిస్తున్నాయి. అశ్వారావుపేట నియోజకవర్గం, దమ్మపేట మండలానికి కూత వేటు దూరంలో గల ఓ గ్రామంలో అతని స్నేహితుడు వద్ద భారీగానే డబ్బును దాచిపెట్టినట్లు సమాచారం. ఆ డబ్బుతో అతని స్నేహితుడు సుమారు 100 రుస్తుం లాంటి కోడిపుంజులను తయారు చేశాడని, ఒక్కో పుంజు ధర రూ.లక్ష నుండి, లక్షన్నర వరకు చెబుతున్నాడని, ఆంధ్రా నుండి పెద్ద, పెద్ద రాజకీయ నాయకులు వచ్చి పుంజులు కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తుంది. వారితో కలిసి సంక్రాంతి బిరులు తీసుకోవటంతో పాటు అక్కడ బారీగా సైబర్ క్రైం ద్వారా అమాయకుల నుండి కొట్టేసిన డబ్బు మార్పిడి జరుగుతుందని సమాచారం. గత కొన్ని రోజులుగా బ్రదర్స్ పై అటు సైబర్ క్రైం పోలీసులతో పాటు, టాస్క్ పోర్స్, ఇంటిలిజెన్స్, స్థానిక పోలీసుల నిఘా పెరగటం, బ్రదర్స్ తో సంబందాలున్న ప్రతి ఒక్కరి ఇండ్లలో సోదాలు జరగటం, పలువురిని అరెస్ట్ చెయ్యటంతో బ్రదర్స్ స్నేహితుడు కూడా కనిపించటం లేదని, అతనిని పట్టుకుంటే సమస్త సమాచారం దొరుకుతుందని ఆ గ్రామంలోని వారే తెలపటం విశేషం. త్వరలో సంక్రాంతి సంబురాలు మొదలవ్వనుండగా ఊహించని సంఘటన వారితో సంబందాలున్న వారికి నిద్రలేని రాత్రులను చేస్తున్నాయని, ఇప్పటికే కల్లూరు మండలంతో పాటు నియోజకవర్గ స్థాయి దాటి రాష్ట్ర స్థాయికి వారి కీర్తి ప్రతిష్టలు రచ్చకెక్కాయని, కల్లూరు మండలం అదే గ్రామంతో పాటు ఆ గ్రామానికి కూత వేటు దూరంలో గల మరో గ్రామంలో కూడా భారీ సైబర్ క్రైం చేసిన వ్యక్తులున్నారని, కరోనా కాలంలో వారు చేసిన క్రైంలు పలు పత్రికలలో వచ్చి నా ఆ సమయంలో ఎవరూ పట్టించుకోలేదని, వారిని ఆదర్శంగా తీసుకున్న బ్రదర్స్ నేడు కటకటాల పాలయ్యే పరిస్థితికి వచ్చిందని ప్రజలంటున్నారు. రాజకీయాలే లక్ష్యంగా కల్లూరు మండలంలోని రెండు గ్రామాలకు చెందిన రెండు కుటుంబాల వ్యక్తులు సైబర్ క్రైమ్ ద్వారా భారీగా కోట్లు కొల్లగొట్టారు. ఒకరి చీకటి కోణం గత కరోనా సమయంలో పత్రికల సాక్షిగా ప్రచురితమైంది. ఆ సమయంలో ప్రజలు ఆ వార్తలకు అంతగా ప్రాధాన్యత నివ్వకపోవటంతో, ఆయన గుట్టు రట్టు కాలేదు. ప్రస్తుతం ఆ వ్యక్తి రాజకీయాల్లో నాటుకు పోవాలనే లక్ష్యంతో భారీగా ప్రణాళికలు రూపొందిస్తున్నాడు.ఆయన తరహాలోనే బ్రదర్స్ ఆయనను ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లో తమ చక్రం తిప్పి, తిరుగులేని శక్తిగా ఎదగాలనుకున్నారు. కాని ఆదిలోనే వారికి చుక్కెదురైంది. బ్రదర్స్ కి చుక్కెదురవ్వటానికి వారు ఆదర్శంగా తీసుకున్న వ్యక్తే కారణమని కల్లూరు మండలంలో జోరుగా ప్రచారం జరుగుతుంది. త్వరలోనే ఆ కాబోయే నేత కూడా సైబర్ క్రైం పోలీసులకు చిక్కుతాడని ప్రజలు గుస, గుసలాడుకుంటున్నారు.

## వీరబాబును అఖండ మెజారిటీతో గెలిపించండి



ప్రజాపక్షం/సత్తుపల్లిః ఈనెల 17న జరగనున్న పంచాయతీ ఎన్నికలలో కత్తెర గుర్తుపై ఓటే వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను ఓటు అభ్యర్థిస్తున్నారు తుమ్మూరు సర్పంచ్ అభ్యర్థి కూసంపూడి వీరబాబు. బుధవారం సర్పంచ్ అభ్యర్థి వీరబాబు తన ప్యానల్ వార్డు సభ్యులతో కలిసి తుమ్మూరు గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్నారు. వీరబాబుకు ఓటర్లు ఘన స్వాగతం పలుకుతున్నారు. మొదటి నుండి ప్రజల మనిషి, పేదల కష్టాలు తెలిసిన వ్యక్తి వీరబాబు అని ఆయన సర్పంచ్ గా గెలిస్తే గ్రామం బాగుపడుతుందని గ్రామస్థులంటున్నారు. తనను అత్యదిక మెజార్టీతో గెలిపిస్తే గ్రామంలో రైతులకు అండగా ఉంటానని, రైతులకు ఆరోప్రాణమైన పశువుల రక్షణ కోసం నెలకు ఓ సారి పశువైద్య శిబిరాలను నిర్వహింపచేస్తానని, మహిళలకు స్వయం సహాయక సంఘాల ద్వారా ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించి, మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా చేస్తానన్నారు. ఎంతో చరిత్ర ఉన్న తుమ్మూరు గ్రామాన్ని మరింత ఉన్నతం తీర్చిదిద్దుతానన్నారు. నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్దమయ్యేలా స్టడీ మెటీరియల్ అందిస్తానన్నారు. వీధి లైట్లు, అంతర్గత రహదారులు, లైబ్రరీ, డ్రైనేజీ వ్యవస్థను మరింత మెరుగు పరుస్తానని, సీజనల్ వ్యాధులు ప్రబలే వర్షాకాలంలో మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రజలను సీజనల్ వ్యాధులకు దూరంగా ఉంచేలా చూస్తానన్నారు.

## ప్రచారంలో దూసుకుపోతున్న బిఆర్ఎస్ అభ్యర్థి యశోద



ప్రజాపక్షం/సత్తుపల్లిః ఈ నెల 17న జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో సదాశివునిపాలెం గ్రామం నుండి బిఆర్ఎస్ పార్టీ బలపరచిన సర్పంచ్ అభ్యర్థి దుబ్బాక యశోద చందు ప్రచారంలో దూసుకుపోతున్నారు. గ్రామ మాజీ ఉప సర్పంచ్ కాల్నేని వెంకటేశ్వర రావు, సీనియర్ నాయకులు కలిసి గ్రామం లో ఇంటి ఇంటి ప్రచారం నిర్వహిస్తూ కత్తెర గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఓటర్లను ఓట్లు అభ్యర్థిస్తున్నారు. గతంలో గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని చూడాలన్నారు. తనను గెలిపిస్తే గ్రామంలో ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ, మహిళలకు మరింత ప్రాధాన్యత కల్పిస్తూ, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి స్వయం సహాయక సంఘాల ద్వారా ఉచిత శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామ ప్రజలకు మంచి అభివృద్ధికి పాటు పడతానని మాట ఇస్తున్నానని, ప్రజలు ఆదరించి కత్తెర గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆశీస్సులతో పోటీలో ఉన్నానని, మీ ఇంటి ఆడబిడ్డగా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రచారంలో ఇంటింటికి తిరుగుతున్న యశోద చందు, వార్డు సభ్యులకు ఓటర్లు నిరాజనాలు పలుకుతున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తుంబూరు దామోదర్ రెడ్డి, మందపాటి సూరప్రకాష్ రెడ్డి, కాల్నేని వెంకటేశ్వరరావు, ఆళ్ల రమేష్, కర్నాటి భద్రం, చింతల రవి, ముసిపట్ల సాంబశివరావు, పర్స కృష్ణ, మామిళ్ళ వెంకటేశ్వరరావు, జానపాషా, కందుకూరు వెంకయ్య, బలుసుపాటి పుల్లారావు, సాకి నాగేశ్వరరావు, తుంబూరు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలి : డిఎస్‌పి



ప్రజాపక్షం/మణుగూరుః గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం మండలాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు మణుగూరు డీఎస్పీ వి. రవీందర్ రెడ్డి తెలిపారు. ప్రజలు ఎటువంటి భయం లేకుండా, ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి, ఎటువంటి అవాంఛనీయం జరగకుండా కట్టుదిట్టంగా భద్రతను చేపట్టాలని ఆదేశించారు. సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ స్టేషన్ హద్దులను దాటి వెళ్లవద్దని, ఏదైనా సమస్య ఏర్పడితే వెంటనే ఉన్నతాధికారులను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా కొన్ని రాజకీయ నాయకులు ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించిన సందర్భంలో చట్టవిరుద్ధ చర్యలు చేస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయన తెలిపారు.

# తొలి విడతకు సర్వం సిద్ధం

- నేడే పోలింగ్, ఫలితాలు
- కాంగ్రెస్‌కు తప్పని రెబల్స్ బెడద
- భద్రాచలం, సారపాకల్లో తొలిసారి ఎన్నికలు







ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : తొలివిడత స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా నేడు పోలింగ్ జరగనుంది. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లోని చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం మండలాల్లో నేడు ఉదయం 7 గం. నుండి 1 గం. వరకు ఓటింగ్ జరగనుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గం.ల నుండి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. ఇందులో భాగంగా ఎన్నికల సామాగ్రిని అధికారులు సిబ్బందికి పంపిణీ చేశారు. జిల్లాలోని 159 గ్రామ పంచాయితీలకు చెందిన 1436 వార్డుల్లో ప్రజలు తమతమ ఓట్లను వినియోగించుకోనున్నారు. ఇందుకోసం 1428 పలోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల విధుల్లో 1713 మంది అధికారులు, 2295 మంది సిబ్బంది పాల్గొంటున్నారు. చర్ల మండల కేంద్రంలో కలెక్టర్, సబ్ కలెక్టర్, జితేష్ వి పాటిల్, మ్రినాల్ శ్రేష్ట,భద్రాచలం మండల కేంద్రంలో ఐటిడిఏ పిఓ రాహుల్ ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు.

కాంగ్రెస్‌లో రెబల్స్ బెడద : అధికార కాంగ్రెస్ పార్టీలో రెబల్స్ బెడద పిట్టి పీడిస్తోంది. ఈ తతంగం ఆ పార్టీ బలపరిచే అభ్యర్థులపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపే అవకాశం, ప్రధాన ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీకి అనుకూల వాతావరణ ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి. నామినేషన్ల సమర్పణ సమయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పులువురు పెద్ద ఎత్తున దరఖాస్తులు సమర్పించారు. ఒకే పార్టీకి చెందిన వారు ఒకే వార్డులో నామినేషన్లు వేయడంతో తీవ్ర తలనొప్పిగా మారింది. ఉపసంహరణ క్రమంలో బుజ్జగింపుల అనంతరం పోటీ నుండి తప్పుకున్నప్పటికీ లోలోన మాత్రమ కసిగానే ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో క్రాస్ ఓటింగ్ జరిగితే అది బిఆర్ఎస్ బలపరిచే అభ్యర్థులకు కలిసిరానుంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో సిపిఐ, బిఆర్ఎస్‌తో సిపిఎం, గిరిజన సంఘాలు, బిజెపితో టిడిపి, జనసేన కలిసి నడుస్తూ ఆయా అభ్యర్థులను బలపరుస్తున్నాయి.

తొలిసారి ఎన్నికలు : భద్రాచలం, సారపాక తాళ్లగొమ్మూరు గ్రామ పంచాయితీలకు స్వరాష్ట్రంలో తొలిసారి స్థానిక ఎన్నికలు జరుగుతున్నాయి. 2013 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చివరి సారిగా ఎన్నికలు జరిగాయి. భద్రాచలం, సారపాక గ్రామపంచాయితీలను మున్సిపాలిటీలుగా మార్చేందుకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికలు నిర్వహించకుండా ప్రక్కపు పెట్టాయి. గిరిజన సంఘాలు ఈ రెంటినీ గ్రామ పంచాయితీలుగానే కొనసాగించాలని న్యాయపోరాటం చేయడంతో ఈ సారి ఎన్నికలు జరుగుతున్నాయి. మరో ప్రక్క గత ప్రభుత్వం భద్రాచలం గ్రామ పంచాయితీని మూడు ముక్కలుగా చేసేందుకు ప్రయత్నం చేసింది. ఆ తర్వాత అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గతం మాదిరిగానే ఏక పంచాయితీగా కొనసాగించేందుకు అంగీకారం తెలిపింది.

తొలినాళ్ల నుండి భద్రాచలం గ్రామపంచాయితీ ఎన్నికల వ్యవహారంలో అనేక చిక్కులు ఎదురవుతూనే ఉన్నాయి. 1982లో మొదటిసారి ఎన్నికలు జరిగాయి. 1987లో న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తడంతో ఆగిపోయాయి. 2001లో టౌన్‌షిప్‌గా ప్రకటించడంతో ఇఓ పాలనలో సాగింది. 2005లో సారి గ్రహణం ఎదురైంది.

పెద్ద, చిన్న : భద్రాద్రి కొత్తగూడె ం జిల్లాలోని భద్రాచలం గ్రామపంచాయితీ జిల్లాలోనే అతి పెద్ద పంచాయితీగా ఉంది. ఈ పంచాయితీలో 40701 ఓట్లు ఉన్నాయి. అదే విధంగా ఆళ్లపల్లి మండలం అడవి రామవరం జిల్లాలోనే అతి చిన్న పంచాయితీగా ఉంది. ఇక్కడ కేవలం 85 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. ఆ తర్వాతి స్థానంలో గుండాల మండలం దొంగతోగు గ్రామపంచాయితీ 88 మంది ఓటర్లతో ఉంది.

ఎన్నికల సామాగ్రి సరఫరా : 1713 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి తొలివిడత ఎన్నికల సామాగ్రిని సిబ్బందికి పంపిణీ చేశారు. వివిధ వాహనాల్లో 8 మండలాల్లో గల ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది బుధవారమే తీసుకెళ్లారు. ఉదయం 7 గం. నుండి ఓట్ల ప్రక్రియ మొదలు కానుంది. ఎన్నికల్లో భాగంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఎస్పి రోహిత్ రాజ్ నేతృత్వంలో పటిష్ట చర్యలు చేపట్టారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే : స్థానిక ఎన్నికల్లో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్, బిజేపి మిత్రపక్షాలు గెలుపుపై ఎవరి ధీమాను వారు వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా స్థానిక ఎన్నికలు అధికార పార్టీకి అనుకూలంగా ఉండే అవకాశం ఉంది. జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న చిన్నచిన్న బేదాభిప్రాయాల కారణంగా ఓట్లు చీలుతాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిని బిఆర్ఎస్ అవకాశంగా వాడుకుంటోంది. ఇక బిజేపి మిత్రపక్షాలు అభివృద్ధి ఎజెండాతో ముందుకు సాగుతోంది. దీంతో గెలుపుపై ఎవరి ధీమాను వారు వ్యక్తం చేస్తున్నారు.

## కల్లూరులో అభ్యర్థులకు కాసుల కష్టాలు

ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో స్థానిక సమరంలో నామినేషన్ ప్రక్రియ ప్రారంభం నుంచి సర్పంచ్, వార్డ్ అభ్యర్థులు కు కాసులు కష్టాలు వచ్చాయి. మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీలకు గాను రెండు గ్రామపంచాయతీలు ఏకగ్రీవం కాగా 21 పంచాయతీలకు హోరాహోరీ ఏర్పడింది. దీంతో స్థిరాస్తులు సర్పంచ్ వార్డ్ అభ్యర్థులు తాకట్టు పెడుతున్నారు. మరికొందరు నామినేషన్ ప్రక్రియ నుంచే స్థిరాస్తులను తాకట్టు పెట్టినట్లు చర్చలు కొనసాగుతున్నవి. ఓడినా గెలిచినా రుణభారం తప్పదని నేతలు అనుకుంటున్నారు. సర్పంచ్ పదవికి నామినేషన్ వేయగానే సరిపోలేదు గెలిచే వరకు సవాల్‌గా మారిందని గ్రామాల్లో పలు వార్డు సర్పంచ్ అభ్యర్థులకు సవాల్‌గా మారింది. వారం రోజులపాటు మందు ముక్క , చుక్క, సరే సరే వారం రోజులు పాటు కాసులు కష్టాలు తప్పదు. ఒప్పో సప్పో తీసుకొచ్చి పెట్టాల్సింది అంటూ స్థిర ఆస్తులను పలు ప్రభుత్వ ప్రైవేటు బ్యాంకులలో తాకట్టు పెట్టి దాంతోపాటు బంగారాన్ని కూడా తాకట్టు పెట్టి కాసులను తెచ్చుకొని పలు ఖాతాలలో నిల్వ ఉంచుకొని ఓటర్ల ముఖ్యమైన ఖాతాలకు బదిలీలు చేస్తున్నట్లు సమాచారం. సర్పంచ్ కావాలంటే సర్పంచ్ అభ్యర్థులు అప్పుల వేటలో పడ్డారు. సర్పంచ్ అనే ఆశయంతో ఖర్చు కోసం వెనకాడకపోవటం గమనార్హం.

**గెలిస్తే సర్పంచ్ పదవి.. ఓడిపోతే అప్పుల ఊబి...**

మండలంలో 21 పంచాయతీలలో పోటాపోటీ హోరాహోరీ గా కొనసాగుతోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ స్థానాలలో జనరల్ స్థానాలలో కూడా అధిక సంఖ్య అధికంగా నగదు ఖర్చు చేయబోతున్నట్లు ప్రజల్లో చర్చలు కొనసాగుతుంది. మండలంలో పెద్ద కోరుకొండి, చంద్రుపట్ల, ఎర్రబోయిన పల్లి, పేరువంచ, చిన్న కోరుకొండి, ముగ్గు వేంకటాపురం, మర్లపాడు, రఘునాథ గూడెం తదితర జనరల్ స్థానాలలో అధికంగా ఖర్చు అయ్యే అవకాశం ఉంది. ఈ స్థానాలలో డి అంటే డి హోరాహోరి పోటీ కొనసాగుతుండటంతో ప్రతిష్టాత్మకంగా ప్రత్యేకంగా ఏవిధంగా అయినా ఎంత ఖర్చైనా సరే సర్పంచ్ పదవిని దక్కించుకోవాలని పట్టుదలతో అభ్యర్థులు ఉన్నారు.

**ఆస్తులు, నగలు తనఖా..**

మండలంలో రెండు గ్రామాలలో ఏకగ్రీవం కాగా ఏకగ్రీవమైన స్థానాలలో మతలబు చాలా ఉందని చర్చలు ప్రజల్లో కొనసాగుతున్నవి. ప్రస్తుతం జరుగుతున్న గ్రామపంచాయతీలలో సర్పంచ్ అభ్యర్థి 30 నుంచి 50 లక్షల వరకు భరించాల్సిన పరిస్థితి వచ్చింది. ఇక నగదు కోసం అభ్యర్థులు అప్పుల బాట పట్టారు. అప్పుడే అవుతారు సర్పంచ్.

## ప్రచారంలో దూసుకుపోతున్న లింగయ్య



ప్రజాపక్షం/కూసుమంచి: మండల పరిధిలోని నేలపట్ల గ్రామ పంచాయితీ సర్పంచ్ అభ్యర్థిగా బిఆర్ఎస్ మద్దతుతో పోటీ చేస్తున్న యువకుడు, విద్యావంతుడు, ఖమ్మం ఆర్జేసి కళాశాల ప్రిన్సిపాల్ అలవాల లింగయ్య ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఈనెల 14న జరగనున్న ఎన్నికల్లో తన గుర్తు ఉంగరంపై ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ గ్రామంలోని వృద్ధులు, మహిళలు, యువతను కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ప్రచారం సందర్భంగా లింగయ్యకు ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు. మహిళలు ఎదురేగి హారతులు పట్టి ఆశీర్వదిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం కూడా ఆయన ఇంటింటికి తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో నేలపట్ల సర్పంచ్‌గా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవ చేస్తానన్నారు. పంచాయితీకి రావాల్సిన నిధులను సాధించేందుకు కృషి చేస్తానని, తద్వారా గ్రామంలో నెలకొని ఉన్న స్థానిక సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. అదే విధంగా ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందేలా కృషి చేస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో దోమల వెంకులు, చెరుకుపల్లి నాగయ్య, జాల నాగయ్య, నీరుడు సంగయ్య, కొప్పుల గురవయ్య, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీకి నష్టం కలిగించే వారిని ఉపేక్షించేది లేదు



ప్రజాపక్షం/ములకలపల్లి: పార్టీ క్రమ శిక్షణా చర్యల్లో భాగంగా సీతారాంపురం గ్రామ పంచాయితీకి చెందిన వడ్డె హనుమంతరావు, సున్నం సుశీల పని తీరు పార్టీకి నష్టం కలిగించేలా ఉన్నందున పార్టీ నియోజకవర్గ, మండల నాయకుల పట్ల పరుష పదజాలం వాడుతున్నందున ఈ రోజు నుండి పైన పేర్కొన్న వారివురికి బిఆర్ఎస్ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని బిఆర్ఎస్ మండల కమిటీ ఓ ప్రెస్ నోట్ విడుదల చేసింది. ఈసందర్భంగా వారు అందులో తెలుపుతూ మండల పార్టీ, గ్రామ శాఖ నుండి బిఆర్ఎస్ పార్టీ సంబంధించిన ఎటువంటి సమాచారము వారికి ఇవ్వబోదని తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గ పార్టీ ఇంచార్జి మెచ్చా నాగేశ్వరరావు ఆదేశాలతో మండల సమావేశంలో క్రమశిక్షణ చర్యలో భాగంగా మండల పార్టీ ఈ నిర్ణయం తీసుకుటుందని పత్రికా ముఖంగా తెలపడం జరుగుతుందన్నారు.

## జోరుగా ఎన్నికల ప్రచారం



ప్రజాపక్షం/ములకలపల్లి: బిఆర్ఎస్, బిజెపి, జనసేన పార్టీలు బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కుమారి రెడ్డి బేబీ కుమార్ ములకలపల్లి సర్పంచి పుట్ బాల్ గుర్తుకు ఓటు వేయాలని ములకలపల్లి మాజీ జెడ్‌పిటిసి,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు సున్నం నాగమణి, అశ్వారావుపేట నియోజకవర్గం టిడిపి పార్టీ ఇంచార్జ్ కట్రం స్వామి దొర, మండల టిడిపి అధ్యక్షులు తెల్ల చెన్నయ్య, జనసేన జిల్లా సెక్రటరీ గరిక రాంబాబు, మండల జనసేన అధ్యక్షులు తాటికొండ ప్రవీణ్, మండల బిజెపి సెక్రటరీ అత్యం సాయిలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బుధవారం ములకలపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో ములకలపల్లి గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా కుమారి రెడ్డి బేబీ కుమారి పుట్ బాల్ గుర్తుకు ఓటు వేయాలని, ములకలపల్లి, రాజ్‌పేట కాలనీ, భగత్‌సింగ్ నగర్, గొల్ల గూడెం, మంచికంటి నగర్ గ్రామాలలో ప్రచారం చేశారు. ఈకార్యక్రమంలో శనాగపాటి సీతారాములు, బండి కొమురయ్య, పుష్పాల చందర్‌రావు, వంగవీటి రాజారావు, పుష్పాల హనుమంతు, గ్రామ కమిటీ ప్రెసిడెంట్ బిక్కమల సుధాకర్, టిడిపి మండల సెక్రటరీ పుష్పాల సాయి, నార్లపాటి శ్రీనివాస్, అశ్వారావుపేట మండలం టిడిపి అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ బూత్‌లకు తరలిన సిబ్బంది



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : ఎర్రుపాలెం మండలంలో గురువారం గ్రామపంచాయతీలకు జరగనున్న ఎన్నికలకు ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ పోలింగ్ బూత్ లకు ఎన్నికల అధికారులు తరలివెళ్లారు. మండల ప్రత్యేక అధికారి విజయ్‌చంద్ర, ఎంపిడిఓ సురేంద్ర గ్రామ పంచాయతీల ఎన్నికల అధికారులకు ఎన్నికల సామాగ్రిని పోలింగ్ సిబ్బందికి అందించారు. ఎంపిడిఓ కార్యాలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను అడిషనల్ కలెక్టర్ శ్రీజ పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ఏర్పాట్లపై మండల అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ బూత్‌ల్లో మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉండే విధంగా అధికారులు చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఉషాశారద, ఆర్ఐలు రవికుమార్, జగదీష్, ఎంవిఐ రాజశేఖర్, ఎంపిఓ శ్రీలక్ష్మి , ఆరోలు, జిపిఓలు, గ్రామ కార్యదర్శులు, ఎన్నికల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల పర్యవేక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



**-పోలింగ్ సరళి పరిశీలనకు కలెక్టరేట్‌లో ఏడు స్క్రీన్లు ఏర్పాటు**
**-360 క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు**
**-వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ సెల్‌ను పరిశీలించిన కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల పర్యవేక్షణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేస్తున్న వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ సెల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో మొదటి విడత పంచాయతీ ఎన్నికలు ఏడు మండలాలకు సంబంధించి జరుగుతున్నాయన్నారు. వీటిలో మొత్తం 360 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, 1006 సాధారణ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి క్రిటికల్ పోలింగ్ కేంద్రంలో సిసి కెమెరాలు, వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టామని తెలిపారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని పర్యవేక్షించేందుకు మండలానికి ఒకటి చొప్పున కలెక్టరేట్‌లో మానిటరింగ్ సెల్‌లో ఏడు స్క్రీన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి విడత పోలింగ్ ప్రక్రియను కలెక్టర్‌తో పాటు సాధారణ పరిశీలకులు, ఇతర ఉన్నతాధికారులు నిశితంగా పరిశీలించి సజావు ఎన్నికల నిర్వహణకు పర్యవేక్షణ చేస్తారని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండలంలోని క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు సరిగ్గా పనిచేస్తున్నాయో లేదో క్రాస్ చెక్ చేసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, ఈడిఎం దుర్గాప్రసాద్, టెక్నికల్ టీం సభ్యులు హనుమాచారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు వైరా మండలంలో ఏర్పాట్లు పూర్తి



**-168 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు**
**-400 మంది ఎన్నికల సిబ్బంది అధికారులు**
**-110 మంది పోలీసులు బందోబస్తు**





**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలో పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో 18 పంచాయతీలకు గాను 168 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వైరాలోని సాంఘిక సంక్షేమ గ్రూపులో పాఠశాల నందు ఉదయం నుంచి పోలింగ్ అధికారులు అక్కడకు చేరుకున్నారు. అధికారులు ఎన్నికల సిబ్బందికి గ్రామపంచాయతీలు వార్డులు వారీగా కేటాయించి ఎన్నికల సామాగ్రి అందజేశారు. ఈ ఎన్నికల్లో కోసం 350 మంది ఎన్నికల సిబ్బంది 4 జోనల్ ఆఫీసర్, 8 రూట్ ఆఫీసర్, 22 ఆర్వోలు విధులు నిర్వహిస్తున్నారు. ఎక్కడ ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. విధి నిర్వహణలో 110 మంది పోలీసులు పాల్గొంటున్నారు. ఇద్దరు పిల్లలు పర్యవేక్షణ, 7 ఎస్సైలు 18 గ్రామపంచాయతీ ఎన్నికలకు పూర్తి ఏర్పాట్లు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఎవరికి ఎలాంట్ట ఇబ్బంది కలగకుండా ఉండేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎన్నికల సిబ్బందికి విధులు కేటాయింపు కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ శ్రీజ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను పలు విషయాలు అడిగి తెలుసుకొని ఎన్నికల నిర్వహణలో పాటించాల్సిన జాగ్రత్తలు తెలిపారు.

# పిండిప్రోలు మేజర్ గ్రామపంచాయతీ పీఠం ఎవరికి దక్కేనో..!









**- అందరి చూపు ఆ గ్రామపంచాయతీ ఎన్నికలపైనే**
**- గ్రామంలో పోటాపోటీగా ప్రచారం**

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండలంలో మేజర్ గ్రామపంచాయతీ పిండిప్రోలు ఎన్నికలపై మండల ప్రజలంతా ఆశక్తిగా ఎదురు చూస్తున్నారు. పిండిప్రోలు గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి ఎస్సీ మహిళ రిజర్వేషన్ కావడంతో ముగ్గురు పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన ప్రజాపంథామాస్‌లైన్ అభ్యర్థి ఆరెంపల కేతమ్మ, బిఆర్ఎస్ టిడిపి పార్టీలు బలపర్చిన సిపిఎం అభ్యర్థి కామల్ల సువార్త, స్వాతంత్ర్య అభ్యర్థి దార మంగతాయి గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్ వేసి పోటీలో ఉన్నారు. మొత్తం గ్రామంలో 3537మంది ఓటర్లు ఉండగా పురుషులు 1669 మంది మహిళలు 1868 ఉండగా పురుషుల కంటే మహిళలు 199మంది ఎక్కువ ఉన్నారు. మొత్తం 12 వార్డులు ఉండగా దీనిలో పాపాయి గూడెం ఓటర్స్ కీలకంగా మారనున్నాయి. తిరుమలాయపాలెం మండలంలో మొత్తం 40 గ్రామ పంచాయతీల పరిధిలో పిండిప్రోలు గ్రామం 3537మంది ఓటర్లతో మేజర్ గ్రామపంచాయతీగా ఉంది. అభివృద్ధికి మారుపేరుగా ఉన్న పిండిప్రోలు గ్రామపంచాయతీ ఆదాయం కూడా ఎక్కువే. గ్రామంలో వారపుసంత సుమారు రూ.20లక్షల నుండి రూ.30లక్షలు సంవత్సరానికి పలుకుతుంది. బస్టాండ్ సెంటర్లో పది షాపింగ్ కాంప్లెక్స్ రూములు అద్దెకు సుమారు సంవత్సరానికి రూ4,80,000 ఆదాయం వస్తుంది. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు గ్రామపంచాయతీ జనరల్ ఫండ్ నుండి ఎన్నో అభివృద్ధి పనులు గతంలో గ్రామపంచాయతీ పాలకవర్గం నిర్వహించింది. రాజకీయ చైతన్యం కలిగిన గ్రామ పిండిప్రోలు డిసెంబర్ 14న జరిగే ఎన్నికల్లో మండల ప్రజలంతా పిండిప్రోలు గ్రామపంచాయతీ ఎవరు కైవసం చేసుకుంటారోనని ఎదురు చూస్తున్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎసిపి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండలంలో గురువారం జరుగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను వైరా ఇన్‌చార్జి ఎసిపి వసుంధర్ యాదవ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంత వాతావరరణంలో ఎన్నికలు జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సమన్వయం పాటించాలని తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని, శాంతియుత ఎన్నికల నిర్వహణకు అభ్యర్థులు, స్థానిక ప్రజలకు, రాజకీయ నాయకులు సమకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ మధు, స్థానిక ఎస్సై రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్, సిపిఎం వర్గాల మధ్య ఘర్షణ

**- కాంగ్రెస్ నాయకులు అద్దంకి రవికుమార్‌కు గాయాలు**



**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధిలోని తొండలగోపవరం గ్రామంలో కాంగ్రెస్, సిపిఎం వర్గాల మధ్య ఘర్షణ జరిగి ఇరువర్గాల కొట్లాటలో కాంగ్రెస్ నాయకునికి తీవ్రగాయాలైన సంఘటన బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నా యి. తొండలగోపవరం గ్రామంలో కాంగ్రెస్, సిపిఎం బలపర్చిన బిఆర్ఎస్ అభ్యర్థుల మధ్య ఎన్నికల పోటీ తీవ్ర స్థాయిలో ఉండటంతో గురువారం జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఇరువర్గాలు ఘర్షణ పడగా ఈ కొట్లాటలో కాంగ్రెస్ నాయకుడు అద్దంకి రవికుమార్‌కు తీవ్ర గాయాలై చెయ్యి విరగడంతో వెంటనే మధిరలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల మధ్య పాతకక్షల నేపథ్యంలో ఘర్షణ పడినట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు. విషయం తెలుసుకున్నా స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని పూర్తి బందోబస్తు చర్యలు చేపట్టి పరిస్థితిని చక్కదిద్దారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మధిర మండలంలో ఈ సంఘటన చోటు చేసుకోవటంతో సంచలనంగా మారింది.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలన



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మార్కెట్ యార్డ్ పరిధిలోని మెప్మా పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనగోలు కేంద్రాలను మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఐకెపి, పిఎసిఎస్ సిబ్బందిని ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతులతో మాట్లాడి ఎటువంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం ఆత్కూరు చెక్ పోస్టు వద్ద రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చొప్పకట్లపాలెం సర్పంచ్ బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్ గోపాల్‌రావు, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేస్తా

**ప్రచారంలో దూసుకుపోతున్న కాంగ్రెస్ అభ్యర్థి**



**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్, రాష్ట్ర నేత దయానంద్ ప్రభుత్వ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధికి కృషి చేస్తానని కొత్త కారాయిగూడెం పంచాయతీ కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థి కర్రి సత్యనారాయణ అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కర్రి సత్యనారాయణ ప్రచారంలో దూసుకుపోతున్నారు. కొత్త కారాయిగూడెం పంచాయతీ పరిధిలోని ఇంటింటికి తిరిగి ప్రచారంలో సర్పంచ్ గా గెలిపించి గ్రామ పంచాయతీ సేవ చేసే భాగ్యం కలించాలని ప్రజలను కోరారు. సీసీ రోడ్లు, డ్రైనేజిలు ఇందిరమ్మ ఇండ్లు, మంచినీటి సదుపాయం వంటి అభివృద్ధి పనులు పరిష్కరిస్తామని, గ్రామంలోని పారిశుద్యం నిర్మూలించి గ్రామంలోని సమస్యలను పరిష్కరించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతానని ప్రజలకు వివరిస్తూ గెలుపే లక్ష్యంగా ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఈ ఎన్నికల్లో నిజాయితీకి, నిబద్ధతకు, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని సత్యనారాయణ కోరారు.

## తిప్పనపల్లిలో కాంగ్రెస్ జోరుగా ప్రచారం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండల పరిధిలోని తిప్పనపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ధారావత్ రామారావు ఆధ్వర్యంలో గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ఉచిత బస్సు ఉచిత కరెంటు ఇందిరమ్మ ఇల్లు సన్న బియ్యం తదితర సంక్షేమ పథకాలు చూసి ఓటు వేస్తారని ధీమా వ్యక్తం చేశారు. మెజార్టీ ఏ లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేస్తున్నారన్నారు. మహిళలు ఇందిరమ్మ చీరలతో ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఈకార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో కలెక్టర్ విస్తృత పర్యటన



## ఆస్పత్రి సేవలు, ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన

**ప్రజాపక్షం/చర్ల/దుమ్ముగూడెం :** జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్టతో కలిసి బుధవారం చర్ల, దుమ్ముగూడెం మండలంలో విస్తృతంగా పర్యటించారు. చర్ల ప్రభుత్వాస్పత్రిలో ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య సేవలు, పంచాయితీ ఎన్నికల ఏర్పాట్లు, గ్రామీణ ప్రాంతాలోల మహిళా ఉత్పత్తుల యూనిట్లు పనితీరుపై సమగ్ర సమీక్ష చేస్తూ పలు కీలక సూచనలు జారీ చేశారు. పర్యటనలో భాగంగా ముందుగా ప్రభుత్వాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ప్రతీవార్డు కలియ తిరిగి మౌళిక సదుపాయాలు పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలు, మందులు, హాజరు రికార్డులను పరిశీలించారు. అనంతరం రోగులతో మాట్లాడి కష్ట సుఖాలు తెలుసుకున్నారు. చిన్న చిన్న మరమ్మత్తులు చేపట్టేందుకు ప్రతిపాదనలు చేయాలని వైద్యాధికారిని ఆదేశించారు. గర్భిణీలు, చిన్నారులకు అందిస్తున్న సేవల నాణ్యతను పరిశీలించి అభినందించారు. మండలం కేంద్రంలో పంచాయితీ ఎన్నికల పరికరాల సరఫరా కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల సామాగ్రి అన్నీ ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఎటువంటి భద్రతా లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ ప్రశాంతమైన వాతావారణంలో జరిగేందుకు సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. సుబ్బంపేట గ్రామపంచాయితీ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన మౌళిక సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. పోలింగ్ రోజు ఎటువంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌కొత్తగూడెంలో ముత్యాలమ్మ జాయింట్ లయబిలిటీ యూనిట్‌ను సందర్శించి మహిళలు తయారు చేస్తున్న ఇప్పపువ్వు లడ్డు, నల్లేరు పచ్చడి, చాక్లెట్, టి పొడి అత్పత్తులను పరిశీలించారు. ఇప్ప పువ్వు సేకరణవిధానం, నాణ్యత, నిల్వ విధానాలతో పాటు మార్కెట్ అంశాలను సభ్యులతో చర్చించారు. అదే విధంగా దుమ్ముగూడెం మండల పరిధిలోని బొజ్జికుప్ప మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. బోధనా ప్రమాణాలు, విద్యార్థులు చదువు నేర్చుకునే తీరును ఆయన పరిశీలించారు. కిచన్ షెడ్ ఆవరణలో పెరుగుతున్న వివిధ రకాల మొక్కలను పరిశీలించారు. రీడింగ్, డ్రెసింగ్ హాల్‌ను పరిశీలించారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ సాయి వర్ధన్, డా. కాంత్, డా. రవికుమార్, డా. శ్రావణి, ఎంపిడిఓతో పాటు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయితీ ఎన్నికలకు విస్తృత ఏర్పాట్లు



**ప్రజాపక్షం/భద్రాచలం :** గ్రామపంచాయితీ ఎన్నికలకు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తహశీల్దార్ దనియాల వెంకటేశ్వర్లు, మండలాభివృద్ధి అధికారి నారాయణ తెలిపారు. భద్రాచలం గ్రామ పంచాయితీ పరిధిలో 60 కేంద్రాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌శాఖ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులు ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని, ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీల్దార్, ఎంపిడిఓ కోరారు.

# బిఆర్‌ఎస్ నుండి పలు కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరిక



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండల పరిధిలోని వెంకటాయతండా పంచాయితీ పరిధిలో కర్సలబోడు గ్రామంలో బిఆర్‌ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి బుధవారం 10 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బోజ్య నాయక్, మాజీ సర్పంచ్ గుగులోతు రాములు, వెంకటాయతండా సర్పంచ్‌గా పోటీ చేస్తున్న మాలోత్ పద్మ ఆధ్వర్యంలో చేరారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ రాములు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను చూసి ఆకర్షితులై పలు పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఉచిత బస్సు ఉచిత కరెంటు సన్న బియ్యం రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇల్లు తదితర సంక్షేమ పథకాల అమలు చేస్తుందన్నారు. పార్టీలో చేరిన వారు గుగుల్ సురేష్, కాంగీ రాంబాబు, చిన్న యేసు, బాదలకిషన్, సంతులాల్, మాలోత్ రవి, చిలికి వంశీ, తదితరులు చేరినట్లు తెలిపారు.

# ఆలోచింపజేసిన రక్షణ సందేశం నాటిక

**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాల సందర్భంగా మణుగూరు ఏరియా పీకే ఓసి లో సింగరేణి కళాకారుల ప్రదర్శనలు విద్యుత్ ప్రమాదాలు నివారణ అనే అంశాన్ని మూల కథగా ఎంచుకుని, వాహన ప్రమాదాల నివారణ, అతివేగం, వ్యక్తిగత రక్షణ, పరికరాల ధరింపు ఇతివృత్తంగా ఎంచుకొని మణుగూరు ఏరియా సింగరేణి యాజమాన్యం నిర్వహణలో సింగరేణి కళాకారులు బుధవారం ఉదయం పీకే ఓసి లో ప్రదర్శించిన రక్షణ సందేశం నాటిక అందరినీ ఆలోచింపజేసింది. సభికుల ప్రశంసలు అందుకుంది వివరాల్లోకి వెళితే ... ఓసి2 లో ఆపరేటర్ గా పనిచేసి పదవీ విరమణ చేసిన యస్‌డి నా సర్ పాషా రచన దర్శకత్వంలో ప్రదర్శించిన ఈ కళా ప్రదర్శనలో కళాకారులు తమ పాత్రలకు జీవం పోశారు. అదృశ్య శక్తి విద్యుత్ శక్తి జాగ్రత్తలు పాటించి పనిచేస్తే జగతికి వెలుగునిస్తుంది. ఏమాత్రం నిర్లక్ష్యంగా పనిచేసిన జీవితంలో చీకటిని మిగులిస్తుంది అనే నేపథ్యాన్ని కూడా వస్తువుగా తీసుకొని నాటిక ప్రదర్శన ఆద్యాంతం ఆసక్తిగా కొనసాగింది. స్టేజి పైనే కార్మికుడికి విద్యుత్ ఘాతం దృశ్యం అందరిని సంబరమాశ్చర్యాలకు గురిచేసింది. సింగరేణి మాజీ కార్మికునిగా సింగరేణి సంస్థ పై మమకారం బాధ్యత కలిగిన తండ్రి పాత్రలో యస్‌డి నాసర్ పాషా ఇమిడిపోగా బాధ్యత లేని కొడుకుగా లేకుండా రక్షణ సూత్రాలు పాటించని నిర్లక్ష్యపు కార్మికునిగా జంగం రాజ్ కుమార్ చక్కని నటన కౌసల్యాన్ని ప్రదర్శించాడు. పని పట్ల అప్రమత్తత సంస్థ పట్ల అంకిత భావం, కుటుంబ బాధ్యతలు కలిగిన కార్మికులుగా జర్పుల రాము, కోడి రెక్కల శ్రీనివాస్, పి నరసయ్య, చింతల శంకర్, కొత్తపల్లి సందీప్ లు చక్కని అభినయంతో నటించి తమ పాత్రలకు జీవం పోశారు. ప్రదర్శనలకు మరింత వన్నె తెచ్చే విధంగా ఆర్కెస్ట్రా బృందం ఎన్‌సిహెచ్ పవన్ కుమార్, కే శ్రీనివాస్ ద్వయం స్వాగతం రక్షణ గీతాలు అలపించగా కీబోర్డ్ ఎస్ డేవిడ్ రాజ్, రిథమ్ ప్యాడ్ డి ప్రవీణ్, ఫ్లూటు నరసయ్య చక్కని వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథి ఏరియా జివిం దుర్గం రామచందర్ , రక్షణ తనిఖీ బృందం కన్వీనర్ సిహెచ్ వెంకటరమణ, ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, కళాకారులను ఎంతగానో అభినందించారు. సింగరేణిలో రక్షణ పర్యావరణ పరిరక్షణ దురాలవాట్లపై అవగాహన కలిగించే చక్కని ప్రదర్శన ఇచ్చే కార్మిక కళాకారులకు కొదవలేదని ప్రశంసించారు. అతిథులు ఆహ్వానితుల చేతుల మీదుగా కళాకారులను ప్రశంసిస్తూ జ్ఞాపికలను అందజేశారు. సింగరేణి ఉద్యోగులు కాంట్రాక్ట్ కార్మికులు ఈ ప్రదర్శనను తిలకించారు.




# మీ ఇంటి ఆడబిడ్డగా ఆశీర్వదించండి

## కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిని మోరంపూడి నాగ వెంకట పద్మజ



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మీ ఇంటి ఆడబిడ్డగా ఆదరించి కత్తెర గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిని మోరంపూడి నాగ వెంకట పద్మజ ఓటర్లను ఓట్లు అభ్యర్థిస్తున్నారు. వేంసూరు మండలం, దుద్దేపూడి గ్రామ పంచాయితీకి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా.మట్టాదయానంద్‌లఆశీస్సులతో దుద్దుపూడి సర్పంచ్ గా పోటీ చేస్తున్నానని. ఈ నెల 17న జరగనున్న పంచాయతీ ఎన్నికలలో కత్తెర గుర్తుపై అత్యధిక ఓట్లు వేసి నన్ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. తనని గెలిపిస్తే గ్రామంలో ఎప్పటి నుండో పెండింగ్ లో ఉన్న డ్రైనేజీ, అంతర్గత రహదారులు, సిసి రోడ్లు మెరుగుపరచడమే కాకుండా, సీజనల్ వ్యాధులు ప్రభలే సమయంలో గ్రామంలో బ్లీచింగ్ చల్లించి దోమల నివారణకు చర్యలు చేపట్టి, ప్రజలను సురక్షితంగా ఉంచుతానని, దుద్దుపూడి గ్రామంలో రైతాంగం ఎక్కువగా ఉన్నారని వారందరూ పశువులపై ఆధారపడి జీవిస్తున్నారని, పశువుల రక్షణకు గ్రామంలో వెటర్నరీ డాక్టర్ చే ప్రతినెల క్యాంపులు నిర్వహిస్తానన్నారు. గ్రామంలో అర్హులైన పేదలకు ఎమ్మెల్యే రాగమయి దయానంద్ సహకారంతో ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు కృషి చేస్తానన్నారు. కత్తెర గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

# మీ ఇంటి బిడ్డగా ఉంటా ఆశీర్వదించండి

## బేతుపల్లి సర్పంచ్ అభ్యర్థి దొడ్డా రాజేంద్రప్రసాద్ (అమ్ములు)



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఈనెల 17న జరగనున్న ఎన్నికలలో కత్తెర గుర్తుపై ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని మీ ఇంటి బిడ్డగా మీకు అందుబాటులో ఉంటానిని హామీ ఇస్తున్నారు బేతుపల్లి సర్పంచ్ అభ్యర్థి దొడ్డా రాజేంద్రప్రసాద్ (అమ్ములు). బేతుపల్లి గ్రామంలో దొడ్డా రాజేంద్రప్రసాద్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. వార్డు సభ్యులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ, ప్రతి ఒక్కరికి గతంలో తాను చేసిన సేవలను వివరిస్తూ, తాను గెలిస్తే చేయబోయే కార్యక్రమాలను తెలుపుతూ ఓటర్లను ఓట్లు అభ్యర్థిస్తున్నారు. కత్తెర గుర్తుపై ఓటేసి అఖండ మెజారిటీ అందించాలని ఓటర్లను ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ప్రచారంలో ఇంటింటికి తిరుగుతున్న దొడ్డా రాజేంద్ర ప్రసాద్, వార్డు సభ్యులకు బేతపల్లి గ్రామ ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు. తనకు కేటాయించిన కత్తెర గుర్తు, పోస్టర్లకు అంకమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు దొడ్డా రాజేంద్రప్రసాద్. అంకమ్మ తల్లి ఆశీస్సులతో బరిలో నిలిచానని మీ అందరూ ఆశీర్వాదం కావాలని కోరుతున్నారు అమ్ములు.

# ప్రాణాలను కాపాడిన ఈఎన్‌టి వైద్యులు

**- విజయవంతంగా**
**గొంతు ఆపరేషన్ చేసిన డిసిహెచ్‌ఓ రవిబాబు**
**- రెండు గంటల పాటు శ్రమించిన వైద్యులు**



**ప్రజాపక్షం/పాల్వంచ :** క్షణికావేంతో గొంతు కోసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఓ వ్యక్తికి డిసిహెచ్‌ఓ రవిబాబు రెండు గంటల పాటుగా శ్రమించి విజయవంతంగా గొంతు ఆపరేషన్ చేసి నిండి ప్రాణాలను కాపాడిన సంఘటన బుదవారం జరిగింది. వివరాల్లోకి వెళితే కొత్తగూడెం గణేష్ టెంపుల్ ప్రాంతంలో గల ఓ నూడిల్స్ హోటల్‌లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన బిశాల్ తమంగ్ మాస్టర్‌గా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో క్షణికావేశంతో గొంతుకోసుకొని ఆత్మాహత్యకు పాల్పడ్డాడు. గమనించిన నూడిల్స్ పాయింట్ యాజమాని హుటాహుటిన కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించారు. ఆపరేషన్ చేయటం ఇక్కడ సాద్యం కాదని పరిస్థితి విషమంగా ఉందని వెంటనే వరంగల్ ఎంజిఎం కు వెళ్ళాలని సూచించారు. జిల్లా ఆసుపత్రుల సమన్వాయాధికారి రవిబాబు బాదిత బదువుల ద్వారా విషయం తెలుసుకొన్నారు.తక్షణమే పాల్వంచకు తరలించాలని సూచించారు. పాల్వంచ వైద్యులను అప్రమత్తం చేశారు. ఆపరేషన్‌కు కావలసిన ఏర్పాట్లను చేయాలంటూ ఫోన్‌ద్వారా ఆదేశాలు జారీ చేశారు. స్వతహాగా ఈఎన్‌టి వైద్యులైన రవిబాబు, జనరల్ సర్జన్ సోమరాజు దొర, అనస్థీషియా వైద్యులు రాంప్రసాద్‌ల సహకారంతో సుమారు రెం డు గంటల పాటు శ్రమించి బాదితుడి గొంతుకు విజయవంతంగా ఆపరేషన్ చేసి ప్రాణాలను కాపాడారు. అనంతరం ప్రత్యేక అంబులెన్స్‌లో వైద్యులు రాంప్రసాద్, సహాయక సిబ్బంది నరసింహ లు భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళి ఐసియులో చేర్పించారు. ప్రాణాపాయ స్థితికి చేరుకొన్న వ్యక్తికి ఆపరేషన్ చేసి ప్రాణాలను కాపాడిన వైద్య బృం దానికి జిల్లా కలెక్టర్ జితేష్‌వి. పాటిల్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# నియోజకవర్గంలో బోణి కొట్టిన సిపిఐ

## రామానగరం రెండవ వార్డు సిపిఐ అభ్యర్థిని సింగపోగు లక్ష్మి ఏకగ్రీవం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గం లో సిపిఐ పార్టీ తొలి బోణి కొట్టింది. బుధవారం ఏకగ్రీవమైన రామానగరం సర్పంచ్ అభ్యర్థిని తో పాటు, సిపిఐ పార్టీ బలపరిచిన 2వ వార్డు అభ్యర్థిని సింగపోగు లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైంది. సిపిఐ పార్టీ బలపరిచిన అభ్యర్థిని ఏకగ్రీవంతో పాటు రామానగరం పంచాయతీ ఏకగ్రీవంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ తీవ్ర కృషి జరిపారు.